# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 83 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

23-01-2026 శుక్రవారం వెల : 1 /- పేజీలు : 4


# రథసప్తమి ఉత్సవాల భద్రత ఏర్పాట్లు

## కె.ఆర్. స్టేడియంలో క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఐపిఎస్.

**నవతరం-శ్రీకాకుళం**



అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి రథసప్తమి ఉత్సవాల నిర్వహణలో భాగంగా, శ్రీకాకుళం నగరంలోని కె.ఆర్. స్టేడియంలో జరుగుతున్న సాంస్కృతిక వేదికల నిర్మాణం, ఎగ్జిబిషన్ స్టాళ్ల ఏర్పాట్లను జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర్ రెడ్డి ఐపీఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు, ఎంట్రీ ఎగ్జిట్ మార్గాలు, అత్యవసర సేవల కోసం ప్రత్యేక మార్గాల కేటాయింపు, గ్యాలరీలు మరియు బారికేడ్ల పటిష్టత తదితర అంశాలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశాలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలకు వేలాది గా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున, గ్యాలరీలు, సిట్టింగ్, బారికేడ్లను పూర్తిగా సురక్షితంగా, పటిష్టంగా ఉండాలని సూచించారు. 24 తేదీన జరగనున్న థమన్ మ్యూజికల్ షో వేదికను జిల్లా ఎస్పీ పరిశీలించి,ఎటువంటి లోటు లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడా తోపులాటలు లేదా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన కిడ్స్ ప్లే ఏరియా, అమ్యూజ్‌మెంట్ పార్కులు, వేదికలను జిల్లా ఎస్పీ పరిశీలించి, పిల్లల భద్రతకు ఎటువంటి లోటు లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్ స్టాళ్లను తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ స్థలాలను క్రమబద్ధీకరించాలని, వాహనాల రాకపోకలను సమర్థవంతంగా నియంత్రించాలని సూచించారు. భక్తులు, సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో క్రిష్ణ మూర్తి, డీఎస్పీ వివేకానంద, ఎస్బి ఇన్స్పెక్టర్ ఇమ్మనయిల్ రాజు, రెవెన్యూ, మునిసిపల్, విద్యుత్, ఆర్?అండ్?బీ తదితర విభాగాలు అధికారులు పాల్గొన్నారు.

# సి. ఎం. రిలీఫ్ చెక్కులు పంపిణీ

## పాతపట్నం ఎం. ఎల్. ఏ. గోవిందరావు

**నవతరం పాతపట్నం**




ఎల్.ఎన్. పేట మండలం యంబరాం గ్రామానికి చెందిన కొర్ను సీమయ్య గారికి 35,000/- రూపాయలు, పెద్దకోట పంచాయతీకి చెందిన జాడ గణేష్ గారికి 80,643/- రూపాయిలు, కాగాన కృష్ణ గారికి 41,084/-రూపాయిలు, వియాపు జ్యోతి ప్రసాద్ గారికి 55,227/-రూపాయలు చెక్కులు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం అందించిన శాసనసభ్యులు గౌరవ శ్రీ మామిడి గోవిందరావు గారు...

ధన్యవాదములు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు.. పాతపట్నం నియోజకవర్గం ఎల్.ఎన్. పేట మండలంలో గల పలువురు కుటుంబ సభ్యులు అనారోగ్యంతో బాధపడుతూ స్థానిక నాయుకుల ద్వారా స్థానిక శాసనసభ్యులు గౌరవ శ్రీ మామిడి గోవిందరావు గారి దృష్టికి తీసుకురాగా వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొరకు సిఫారసు చేసి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆ కుటుంబాలకు 2,11,954/- లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకునే ఆర్థికస్థోమత లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్న ప్రభుత్వం ఈ ఎన్డీఏ ప్రభుత్వం అని తెలియజేశారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా జవీ=ఖీ నిధులు అందిస్తున్నారు. అలాగే ఈ నియోజకవర్గంలో గత పాలకులు ఏరోజైనా సీఎం సహాయనిది కోసం ఒక్క దరఖాస్తు అయిన చేయలేదని నియోజకవర్గ ప్రజలకు గుర్తు చేశారు.

# కేంద్ర గిరిజన వర్సిటీకి గిడుగు పేరు పెట్టాలి

## విశ్రాంత రీడర్ డాక్టర్ చంద్రశేఖర్

**నవతరం -పొందూరు**



విజయనగరంలోని కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయానికి వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పేరు పెట్టాలని విశ్రాంత తెలుగు రీడర్, గిడుగు దర్శనం పుస్తక రచయిత డాక్టర్ అల్లంశెట్టి చంద్రశేఖరరావు అన్నారు. గిడుగు వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక రెండో నెంబర్ మండల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చంద్రశేఖరరావు పాల్గొని మాట్లాడారు. తెలుగు,సవర భాషల వికాసానికి గిడుగు చేసిన సేవలు మరపురానివని పేర్కొన్నారు. నామ విజ్ఞాన వేత్త, విశ్రాంత ప్రథమ శ్రేణి తెలుగు పండిట్ వాండ్రంగి కొండలరావు మాట్లాడుతూ కందుకూరి, గురజాడ వంటి ప్రముఖులతో కలిసి 1919 ప్రాంతంలో వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజాన్ని ఏర్పాటు చేసిన ఘనత ఆయనదేనని పేర్కొన్నారు. అలాగే తెలుగు పత్రికను స్థాపించి తద్వారా వ్యావహారిక భాషోద్యమాన్ని ఉద్ధృతం చేశారన్నారు. తెలుగు భాషలో ఇద్దరు వాగనుశాసనులున్నారని, ఒకరు నన్నయ కాగా మరొకరు గిడుగు రామ్మూర్తియని పేర్కొన్నారు. జిల్లా ఖజానా,లెక్కల శాఖ ఉప సంచాలకులు ఎ.ధర్మారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పి.దివాకర్ పాత్రో,వడగ సూర్యారావు, విశ్రాంత హెచ్.డబ్ల్యో.వో గుంటుకు ప్రభాకరరావు,బొడ్డేపల్లి జనార్దనరావు,గుడ్ల గురుమూర్తి,వడగ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సమావేశం గిడుగు మహాశయునికి నివాళులర్పించింది.

# ఐతమ్ విద్యార్థులకు స్టాక్ మార్కెట్‌పై అవగాహన

## డైరెక్టర్ ప్రో వివి నాగేశ్వరరావు



**నవతరం-టెక్కలి**

ఐతం కళాశాలలో బిజినెస్ మే నేజ్మెంట్ విద్యార్థులకు సెక్యూరిటీ మార్కెట్?పై సమగ్ర అవగాహన కార్యక్రమంలో "ఓవర్వ్యూ ఆన్ సెక్యూరిటీ మార్కెట్" అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి నట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి వి నాగేశ్వరావు తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని సె బీ.మరియు బొంబాయి స్టాక్ ఎక్స్చేంజ్-ఐపీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా బొంబాయి స్టాక్ ఎక్స్చేంజ్‌కు చెందిన జనరల్ మేనేజర్ శ్రీకాంత్ , సీనియర్ ఎగ్జిక్యూటివ్ కె. నాగభూషన్ శిక్షకులు గా పాల్గొని సెక్యూరిటీ మార్కెట్ నిర్మాణం, షేర్లు, బాండ్లు, పెట్టుబడి విధానాలు, పెట్టుబడిదారుల రక్షణ, రిస్క్ అంశాలపై విపులంగా వివరించారు.

పెట్టుబడుల విషయంలో విద్యార్థులు సరైన అవగాహనతో ముందడుగు వేయాలని వారు సూచించారు.

ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా .ఎ ఎస్ శ్రీనివాసరావు, సంబంధిత విభాగ హెచ్ ఒ డి డా. శ్రీకాంత్, సి ఎస్ ఎం హెచ్.ఒ. డి డా ఎం వి బి చంద్రశేఖర్, పాల్గొనగా, డా. బి. బలరాం సమన్వయకర్తగా వ్యవహరించారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# మణిపాత్రునికి కళా ప్రవీణ బిరుదుతో సత్కారం

**నవతరం-శ్రీకాకుళం**

బుధవారం, శ్రీకాకుళం పట్నం అరసవిల్లికి చెందిన మణిపాత్రుని నాగేశ్వరరావుకు కళా ప్రవీణ బిరుదునిచ్చి ఘనంగా సత్కరించారు. శ్రీశ్రీ కళ వేదిక, ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవాడలో ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆడిటోరియంలో జరిగినది. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షులు జాతీయ మహిళా అధ్యక్షురాలు ఈశ్వరి భూషణ్, సంస్కృత పండితులు కావూరి శ్రీనివాసరావు, దేవిక రాణి వడియార్, భోగేల ఉమామహేశ్వరరావు, డబ్బేరు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇది తనకు 987వ సన్మానమని అన్నారు.

ఎడిటోరియల్

# మేడిపండు

'మేడిపండు చూడ
మేలిమైయుండు
పొట్ట విప్పిచూడ
పురుగులుండు' అని

వేమన కొన్ని శతాబ్దాల క్రితమే పోల్చి చెప్పాడు. ఇప్పుడు ప్రతి విషయానికీ, ప్రతి వ్యక్తికీ పోల్చదగినదిగానే ఉంటోంది. పొట్ట విప్పకుండానే భ్రష్టత్వమంతా బయటపడుతూనే ఉంది. 'ఇంటిపేరు కస్తూరివారు, ఇంట్లో గబ్బిలాల మోత' అని ఒక నాటకంలో పాత్రధారి అంతర్మధన సంభాషణ ఉంటుంది. అదే మాదిరి ఇప్పుడు ఎవరికి వాళ్లం సంభాషించుకోవాల్సిన సందర్భం ఎదురౌతున్నది. మన ప్రచారార్భాటాలకు కొదువలేదు. ప్రకటనలకు, ప్రగల్భాలకు అంతేలేదు. కానీ ఒక్కసారి బతుకులోకి, జరుగుతున్న కథలోకి తొంగిచూస్తే చాలా దయనీయ స్థితి దర్శనమిస్తోంది. ఒక భ్రమాత్మకమైకంలో మనమంతా ఊగుతున్నామా అనిపిస్తుంది. మనల్ని కమ్మేసిన పొరల్ని తొలగించి, పక్కనబెట్టి చిన్నగా చూసుకోవాలి. మనమెలా ఉన్నామో, ఎటు పయనిస్తున్నామో!

ప్రపంచంలోనే నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా గొప్పలు పోతున్నాం. జపాన్?, బ్రిటన్? ఆర్థిక వ్యవస్థలనూ దాటేశాం. జీడీపీలో ఎంతో ముందున్నాం, అభివృద్ధిలో నూతన శకంలోకి పయనించామని చెప్పుకుని గర్వపడుతున్నాము. విశ్వగురు పీఠాలనూ ఆపాదించుకుంటున్నాం. కానీ, దేశంలోని సామాన్య ప్రజలకు కనీసం రెండు పూటలా తిండిపెట్టలేక పోతున్నామనే సంగతిని ఎవరైనా పట్టించుకున్నారా! అంతెందుకు, కనీసం తాగటానికి మంచినీళ్లు ఇవ్వగలుగుతున్నామా! మధ్యప్రదేశ్?లోని ఇండోర్?లో మున్సిపాలిటీ సరఫరా చేసిన కలుషిత నీరు తాగి దాదాపు ఇరవై మంది ప్రాణాలు కోల్పోయారు. వందలమంది ఆస్పత్రి పాలు కావడం అనేది ఒక్క ఉదా హరణ మాత్రమే. దేశంలో మంచినీరు సరిగాలేకపోవటం వలననే అనేక వ్యాధులకు గురవుతున్నారని పరిశోధనలు తేల్చి చెబుతున్నాయి. ఇదిలా ఉంటే, మంచినీటి వ్యాపారం దినదినమూ పెరిగి వేలకోట్ల రూపాయలకు ఎగబాకుతున్నది. ఆర్థిక వ్యవస్థను లెక్కల్లో చూపెడతారు. తాగే నీళ్లను ఎవరు చూస్తారు. ఒక్క ఇండోర్?లనే కాదు, గుజరాత్?లోని గాంధీనగర్?లోనూ కలుషిత నీటితోనే వందలాది మంది అనారోగ్యం పాలయ్యారు. తాగే నీరు కలుషితము. నీల్చేగాలి కలుషితము. ఢిల్లీలో ప్రజలు మాస్క్?లు ధరించకుండా తిరగలేని, బతకలేని పరిస్థితులు వచ్చేశాయి. అక్కడి పౌర సమాజం స్వతంత్రంగానే కాలుష్యాన్ని నివారించే చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వాన్ని డిమాండ్? చేశారంటే ఎంత తీవ్రంగా ఉందో గమనించవచ్చు. ప్రపంచంలోని అత్యంత కలుషితమైన నగరాల్లో అరవై మూడు భారతదేశంలోనే ఉన్నాయని నివేదికలు చెబుతున్నాయి. దేశంలో పెరుగుతున్న జల, వాయు కాలుష్యాలతో గుండె జబ్బులు, ఊపిరితిత్తులు, క్యాన్సర్?లాంటి వ్యాధులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ఇది మన విశ్వగురు ఏలుబడిలో పెరుగుతున్నవి. ఇంకో నిజం ఏమంటే, ఢిల్లీ ఎయిమ్స్? ఆస్పత్రి బయట వందలాది మంది అనారోగ్య బాధితులు, వైద్యం పొందేందుకు పడిగాపులు పడుతున్నారు. చలిలో ఏ సౌకర్యాలూ లేక బాధలు పడుతున్నారు. చలికి వణుకుతూ ఫాల్తిన్? కవర్లు కప్పుకుని వైద్యం కోసం ఎదురుచూస్తున్నారు. ఇది విశ్వగురు నివాస నగరమే! ఇక దేశంలో కార్పొరేట్? వ్యాపారులు తమ లాభాల కోసం సహజ సంపదలను దోచుకునేందుకు పర్యావరణాన్ని విధ్వంస మొనరించే పనులు చేస్తుంటే, ప్రభుత్వం వాళ్లకు వంతపాడుతున్నది. దాంతో ఆవరణమంతా కాలుష్యమయంగా మారుతున్నది. గుజరాత్?, రాజస్థాన్?, ఢిల్లీ మొదలైన ప్రాంతాలకు హానికలిగించే విధంగా ఆరావళి పర్వతాలనూ ధ్వంసం చేయాలని పూనుకున్నారు. సహజ సంపదల దోపిడీతోపాటు ఆవరణ విధ్వంసముతో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ మేడిపండులా మెరిసిపోతున్నది. చిన్నపిల్లలు జ్వరాలు, దగ్గులతో బాధపడుతూ రోగాల భవిత కళ్లెదుట దర్శనమిస్తున్నా కాలుష్యాలనెలా అరికట్టాలన్న ధ్యాసే మన నాయకులకు లేదు. సరియైన దగ్గుమందును కూడా అందించలేక ప్రాణాలనూ తీస్తున్నాము. మందుల్లో కల్తీలు, తిండిలో కల్తీలు, నీటిలో కల్తీలు, గాలిలో కల్తీ, నిండా నిండిపోయిన కల్తీలోకవైపు, ఉపాధిలేమి, నివాస లేమి, భరోసాయే లేని జనం మరోవైపు. అంతేకాదు, అభద్ర జీవన దేశాలలో మన దేశమూ ఉంది. ప్రజాస్వామిక మనుగడ ప్రశ్నార్థకమవుతున్నది. ఇన్నిరకాల బాధలతో, వేదనలతో సతమతమవుతున్న దేశంగా కొనసాగుతున్నదని అనేక నివేదికలు తెలుపుతుండగా, వెలుగుతున్న, దూసుకుపోతున్న అభివృద్ధి వ్యవస్థగా పేర్కొనడం హిపోక్రసీకాక మరేమిటి! కొంతమంది ఆదాయాల లెక్కలుచూసి అదే వెలుగని, మెరుపని తెలిపితే ఏం లాభం! భవిష్యత్? తరాలకు ఎలాంటి సమాజాన్ని అందిస్తున్నామో తెలుసుకుని మసలు కోవడం నేటి అవసరం. మేడిపండు పొట్టనూ విప్పి చూడాలి!

# అందమెక్కడున్నది..?



ఆమె
కళ్ళలోనా?
మేని మెరుపుల్లోనా..?
చిలిపి చూపుల్లోనా?

ముత్యాల్లా మెరిసే
పలువరసలోనా?
గాలితో సరసాలాడే ఆ
నల్లని
ముంగురులలోనా?

కసిగా కాటేసే
కాటుక కళ్ళలోనా?
ముసిముసి నవ్వుల
మల్లెపూల
పరిమళంలోనా?

జడలోనాొమెడలోనా..?
ఆ మెడలో మెరిసే
ముత్యాల
హారంలోనా?

నుదుట పెట్టిన బొట్టులోనా..?
కట్టిన చీర మడతల్లోనా?
గలగలమనే గాజుల సవ్వడిలోనా..?
ఘల్లు ఘల్లుమనే కాలి
మువ్వల మధుర రాగాలలోనా?

హంస నడకల్లోనా
చిలక పలుకుల్లోనా?

అయ్యో
ఆమెలో అందమెక్కడుందొ?
నా కళ్ళకు కనిపించదేమో..?

ముక్కుండీ వాసన
చూడలేని మూర్ఖున్నే నేనూ
కళ్ళుండి కనలేని కబోధినే నేనూ

దివి నుండి భువికి
దిగివచ్చిన ఆ దేవతను...
ఆ అందాల రాశిని...
ఆ అపరంజి బొమ్మను
చూడాలంటో
చాలవు నాకు రెండు కళ్ళు
కావాలౌనాకు ఒళ్ళంతా కళ్ళూ

అసలు లోపమెక్కడుందో
అర్థమైంది.?
ఆమెలో లేదూఆ బ్రహ్మసృష్టిలో
లేదూ
బాహ్యమే తప్ప అంతః
సౌందర్యాన్ని
ఆరాధించలేని నా హ్రస్వ
దృష్టిలోనే...



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# 401 మందికి పెన్షనర్లకు జీవిత ధ్రువపత్రాల వితరణ

నవతరం -పొందూరు

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల,కుటుంబ పింఛనుదార్లకు స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా జీవిత ధ్రువ పత్రాలను అందజేస్తున్నారు.ఈ నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఇంతవరకు 401 మంది. విశ్రాంత ఉద్యోగులకు వీటిని అందజేశారు. అనారోగ్యంతో బాధ పడుతున్న వారికి సంఘ ప్రతినిధులు స్వయంగా వాళ్లింటికే వెళ్లి బరిష్ తీస్తున్నారు.
జనవరి రెండో తేదీ నుండి ఈ ప్రక్రియ ప్రారంభమైంది. పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్లను(జీవిత ధ్రువపత్రాలు) కంప్యూటరికరించి అందజేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.వచ్చే నెల 28 వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. పెన్షనర్లంతా ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తమ తమ జీవన ధ్రువపత్రాలు పొందేందుకు పెన్షనర్ల కార్యాలయానికి హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి 1.00గంట వరకు కార్యాలయం లో



అందుబాటులో ఉంటారు. ఈ కార్యక్రమానికి జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి అంకం ధర్మారావు, పాలవలస దివాకరపాత్రో, అల్లంశెట్టి విజయకుమార్, కోరుకొండ రాజశేఖరరావు, వి.దామోదరరావు తదితరులు ఆధ్వర్యం వహిస్తున్నారు.

# నేడు ప్రభుత్వరంగ సంస్థల కమిటీ పర్యటన

నవతరం -శ్రీకాకుళం

ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ (గ్రాఖజ) జనవరి 23వ తేదీన జిల్లాలో పర్యటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటలకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ, శ్రీకాకుళం, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, గురజాడ, విజయనగరం, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్, శ్రీకాకుళంకు సంబంధించి జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు శ్రీకాకుళం అర్బన్ డెవలప్?మెంట్ అథారిటీ, శ్రీకాకుళం స్మార్ట్ సిటీ కార్పొరేషన్, బొబ్బిలి అర్బన్ డెవలప్?మెంట్ అథారిటీ లకు సంబంధించి రెండు సమావేశాలు శ్రీకాకుళం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం జరుగుతుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఆమదాలవలసలో రైతులకు పశుసంవర్ధక శిక్షణా కార్యక్రమం

## - ఎమ్మెల్యే కూన రవికుమార్



నవతరం -ఆమదాలవలస

రైతుల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో గురువారం పశుసంవర్ధక శిక్షణా కార్యక్రమం స్థానికంగా గురువారం ఘనంగా నిర్వహించారు. ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలోని పాతినవారి వీధిలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమదాలవలస శాసనసభ్యుడు, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ మాట్లాడుతూ, ఆధునిక పశుపోషణ పద్ధతులు రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ళ పెంపకంలో శాస్త్రీయ విధానాలు అనుసరిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అమలు చేస్తున్న వివిధ వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. శిక్షణా కార్యక్రమాల ద్వారా పొందిన అవగాహనను క్షేత్రస్థాయిలో అమలు చేసి ఆర్థికంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక రంగ నిపుణులు పశువుల ఆరోగ్యం, సమతుల్య పోషకాహారం, వ్యాధుల నివారణ, నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు విపులంగా వివరించారు. అలాగే పశువుల బీమా, టీకాలు, మెరుగైన జాతుల ఎంపిక వంటి అంశాలపై రైతుల సందేహాలకు సమాధానాలిచ్చారు.శిక్షణా కార్యక్రమంలో భాగంగా దూడల ప్రదర్శన ఏర్పాటుచేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



రైతులు ఈ ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించి, పశు పోషణపై మరింత అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో శిక్షణా కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో వెటరినరీ అధికారులు, జిల్లా టీడీపీ ప్రెసిడెంట్ మొదలవలస రమేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఎండీ సి.హెచ్. ద్వారకా తిరుమల రావుని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ



నవతరం -శ్రీకాకుళం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (APSRTC) మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సిహెచ్ ద్వారకా తిరుమల రావు గారు గురువారం ఉదయం శ్రీకాకుళం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా, జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి ఐపీఎస్ గారు మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్కను అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా జిల్లాలో ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతం, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాల కల్పన తదితర అంశాలపై చర్చించారు.
జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ చేస్తున్న కృషిని ప్రశంస్తు జిల్లా ఎస్పీని ఆర్టీసీ ఎండీ అభినందించారు.

# అక్షర శ్రీకారానికి విద్య, జ్ఞాన, బుద్ధులకు ప్రతీక వసంత పంచమి వాగ్దేవిదేవి

"యాకాల కమలాది వినుతాయామౌక్తికా భూషణా యాలి సృష్టి స్థితి నాశకారిణపరా యాభూత పంచాత్మికా! యా నతీతి నిషేధితాఖిల మయా యా సర్వ ధాత్రీ !



పరాసాపుష్టాతు సరస్వతీ భగవతీ మాం వాసర్ వాసినీ శరదించు సమాకారే పరబ్రహ్మ స్వరూపిణి వాసర పీఠ నిలయే సరస్వతీ నమోస్తుతే" వాక్, బుద్ధి, వివేకం, విద్య, కళలు, విజ్ఞానం వీటన్నింటికీ అధిదేవతగా సరస్వతిని పూజిస్తారు. అమ్మవారు హంస వాహినిగా, వీణాపాణిగా, పుస్తక మాలాధారిణిగా చిత్రించబడు తుంది. వాగ్దేవీ వర్ణనలలో శ్వేత వర్ణానికి ప్రాముఖ్యత అధికం. సరస్వతి పరాశక్తి రూపాలలో ఒకటి. చదువులనే కాదు శక్తి సామర్థ్యాలను ప్రసాదించే తల్లిగా ఆరాధించబడుతుంది. హిందూమతంలోని ముఖ్యమైన దేవతా మూర్తులలో సరస్వతి మాతను బ్రహ్మ సకల సృష్టి కర్త గనుక సరస్వతిని కూడా బ్రహ్మయే సృష్టించా డని, సృష్టి కార్యంలో తనకు తోడుగా ఉండడానికి తన జిహ్వాపై ఆమెను ధరించాడనీ ఒక గాథ.విద్యారంభమున అందరిచే కొలువబడి దేవత సరస్వతీ మాత కనుకనే ఆమె చదువుల తల్లిగా ప్రశంసింపబడుతోంది. సరస్వతి దేవి బ్రహ్మదేవుని భార్య. బ్రహ్మదేవుని ముఖ కమలమున సరస్వతి వెలసిల్లుతుందని శాస్త్రాలు ఉపదేశిస్తున్నాయి.ముఖ్యమైనది వాక్కు మాట వాక్కు అంటే శబ్దం 'శక్తి ', ఎవ్వరిని నొప్పించకుండా చెప్పదలచుకున్న విషయాన్ని చక్కటి మాటలతో చెప్పడమే శబ్దశక్తి ఉపాసన. మాట తీరు మనస్సుకు అద్దం పడుతుంది మనిషి సంస్కారాన్ని తెలియజేస్తుంది. కనుక మాట మహెదాత్తమయింది. వాగ్దేవి మేధాశక్తిని, బుద్ధిని, విద్యను, జ్ఞానమును, ప్రసాదించినదై,సమస్త విద్యా స్వరూపినియై, తనను భక్తితో ఆరాధించే వారికి యుక్తాయుక్త పరిజ్ఞానమును వివేచనాశక్తిని, జ్ఞాపక శక్తిని, ధారణాశక్తిని, గ్రంథ రచనాశక్తిని, ప్రసాదించునట్టి జగన్మాత మహా సరస్వతి అని, దేవి భాగవతము చెస్తోంది.సరస్వతీ దేవి కొలువై ఉన్న ఆలయాల్లో పిల్లలకు అక్షరాభ్యాసం జరిపిస్తే వారు విద్యలో బాగా రాణిస్తారని పెద్దలు నమ్ముతారు. ప్రతివారికి ఉండే విశ్వాసం వల్ల కొందరు తమ పిల్లల చేత సరస్వతీ దేవి ఆలయంలో ప్రథమంగా అక్షరాలు దిద్దిస్తారు సరస్వతి దేవి కమలంపై ఆసీనురాలై ఉంటుంది. వీణపానిగా దర్శనమిస్తుంది పుస్తకం జపమాల చేతుల్లో ఉంటాయి సాధారణంగా శారదా దేవి విగ్రహం కూర్చున్న భంగిమలోనే ఉంటుంది అయితే నిలబడి ఉన్నా సరస్వతి దేవి ప్రతిమ ఆలయం తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లాలోని అనంతసాగర్ గ్రామము నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది నిలబడిన దేవతా విగ్రహాలు ఉన్న ఆలయాలు ఆ క్షేత్రాలు ఎంతో విశిష్టమైనదిగా చెప్పబడుతున్నాయి తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహం నిలబడి ఉంటుంది. స్వామి నిలబడి భక్తులకు తన పూర్తి రూపంతో దర్శనమిస్తున్నాడు. శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాలు మరియు మధురలోని శ్రీకృష్ణుని విగ్రహం నిలబడే ఉంటుంది కాశీలోని విశాలాక్షి కన్యాకుమారిలోనే కన్యకరమేశ్వరి విగ్రహాలు నిలబడి ఉండటం ఎంతో విశేషంగానో ఈ క్షేత్రాలు ఎంతో విశిష్టమైనవిగాను మహిమాన్వితమైనదని చెబుతారు. ఈ క్షేత్రాలకు వెళ్లి ఆ ఆలయాల్లోని దేవత విగ్రహాలను దర్శించినట్లయితే భక్తుల కోరికలు త్వరగా నెరవేరుతాయి అని భక్తుల ప్రగాఢ విశ్వాసం, నిలబడి ఉన్న సరస్వతి మాత చిన్నకోడూరు గ్రామం సమీపంలో ప్రశాంతమైన వాతావరణంలో పచ్చని చెట్లు పన్నులకు ఆహ్లాదాన్ని కలిగిస్తున్న ప్రదేశములు గుడి పక్కనే ఉన్న సహజమైన నేటిదోనెలు ఉండే ఈ చోట మీనా పని నిలబడి ఉన్న భంగిమలు భక్తులకు దర్శనమిస్తోంది. మన దేశంలో మొదటిసారిగా సరస్వతి దేవి నిలబడిన భంగిమలో ఉన్న విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్టించబడి పూజలు అందుకున్నట్లుగా స్థలపురాన్ని బట్టి తెలుస్తోంది. మహా సరస్వతి పూజ తిథులలో సప్తమి, నక్షత్రములలో మూలా రెండు కలిసిన రోజు మహా సరస్వతి పూజ చేస్తారు. మూలా నక్షత్రం ధనుర్రాశులు ఉంటుంది ధనుర్ రాశికి అధిపతి గురువు. విద్యనిచ్చేవాడు అనగా విద్యా కారకుడు గురువు. ధన, విద్యా, కుటుంబ కారకుడు. జీవన సరళిని ఆనందమయం చేసి మనశ్శాంతిని ఆత్మస్థర్యాన్ని ఇచ్చే మహాశక్తి. భారతదేశంలో గల సరస్వతీదేవాలయ ములన్నింటి లోను బాసర జ్ఞాన సరస్వతీ దేవాలయము సుప్రసిద్ధమైనది. మరియు కాశ్మీరులోని సరస్వతీ దేవాలయము కూడ గొప్ప ఆలయమే. అదిలాబాదు జిల్లాలోని ముధోల్ మండలంలో మహరాష్ట్ర సరిహద్దులోగల జ్ఞాన సరస్వతీదేవి" ఆలయాన్ని గోదావరినదీ తీరమునకు మైలు దూరమున సాక్షాత్ శ్రీమన్నారాయణాంశ సంభూతుడగు శ్రీ వేదవ్యాస మహర్షిచే ప్రతిష్టించబడినది. భారత యుద్ధానంతరము మనశ్శాంతి లభించక వేద వ్యాస మహర్షి తీర్థయాత్రలు చేయుచు గోదావరి నది తీరాన సరస్వతీ దేవి ఉన్నట్లు గ్రహించగా దేవి ప్రసన్నురాలై నీవు నా యొక్క విగ్రహమును ఇచ్చట ప్రతిష్టించి పూజింపుము" అని ఆజ్ఞాపించగా, గోదావరి నది నుండి ఇసుకను తెచ్చి శ్రీ సరస్వతీదేవి విగ్రహమును సర్వాంగ సుందరంగా ప్రతిష్టించబడి ఈ క్షేత్రమున వసించినందున ఈ క్షేత్రము "బాసర" గా వ్యవహరింపబడుచున్నది. వ్యాసపురి ,వ్యాసర, అనబడి తరువాత ఇక్కడ ఉన్న మహారాష్ట్ర ప్రజల ప్రభావం వలన 'బాసర'గా నామాంతరాన్ని సంతరించుకొని ఇక్కడ వ్యాస నిర్మితమైన విగ్రహాలకు పసుపు పూసి అలంకరించి పూజలు నిర్వహిస్తారు. ఈ పసుపును ఒక్క రవ్వంత తినినా అత్యంత విజ్ఞానం, జ్ఞానము లభిస్తుందని గాఢంగా విశ్వసిస్తారు.సరస్వతి దేవి మాఘమాసంలో శుద్ధ పంచమి నాడు ఆవిర్భవించింది శారదా దేవిని తెలుపు రంగు పుష్పాలతో పూజించాలని దేవీ భాగవతంలో నారద మహర్షి తెలియజేశారు. చదువుకు, జ్ఞానానికి నెలవైన జ్ఞాన పీఠం బాసర సరస్వతీ. క్షేత్రంలో జ్ఞానానికి బీజం పడిందని శ్రీపంచమి రోజున ఆలయంలో బాలబాలికలకు అక్షరాభ్యాసం చేయిస్తే విద్యలో అభివృద్ధి చెందడమే కాక జ్ఞానవంతులవుతారని భక్తుల ప్రగాఢ నమ్మకం.. అందుకే సరస్వతి ఆలయాలలో విద్యా అక్షరాభ్యాసానికి ప్రాధాన్యతనిస్తారు. ఆలయ ప్రాంగణంలోని జ్ఞాన ప్రసూనాంబ చేతిలో ఉన్న అఖండ జ్యోతికి నూనె వంచడానికి ప్రాముఖ్యతనిస్తారు. విద్యాప్రాప్తికై ఇక్కడ విద్యార్థులతో అక్షరాభ్యాసము చేయించి దేవికి పలక, బలవము, కాగితము, కలము వంటి కానుకలు సమర్పించే ఆచారము ఉన్నది. మాఘ శుద్ధ శ్రీపంచమినాడు నరస్వతీదేవి జన్మదినంగా ఎ మహాభిషేకం చేసి వివిధ పుష్పాలతో వాగ్దేవిని నయనానందకరంగా అలంకరిస్తారు. జగద్రక్షణకై, భక్త పోషణకై అవతరించిన కామితార్థ ప్రదాయినిగా బాసర జ్ఞాన సరస్వతి శ్రీపంచమినాడు. విశేష పూజలందు కొంటుంది."శరచ్చంద్ర వక్త్రం అసత్పద్మహస్తాం సరోజాతనేత్రాం స్ఫురద్రత్న మౌళీం ఘనాకార వేణీం నిరాకారవృత్తిం భజ శారదాం వాసరా పీఠవాసాం!ధరాభాగనాశాం సురానీకవంద్యాం మృణాలీల సద్భావ కేయూరయుక్తాం త్రిలోకైక సాక్షి మాదారస్తనాధ్యాం భజ్ శారదాం వాసరాపీఠ వాసాం అని చదువుల తల్లిని స్తుతిస్తే సకల విద్యలు ప్రాప్తిస్తాయి.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు



# 14 ఏళ్లకే మందు కొట్టిన నిధి అగర్వాల్

పేజ్-3లో మద్యపానం కామన్. అయితే నిధి అగర్వాల్ ఆ గ్రూప్ లోకి ఎంటర్ అవ్వకముందే మందు కొట్టడం మొదలుపెట్టింది. ఇంకా చెప్పాలంటే 14 ఏళ్లకే ఆమె మద్యపానం మొదలుపెట్టింది.

"14 ఏళ్ల వయసులోనే నేను మందుకొట్టటం మొదలుపెట్టాను. ఆ టైమ్ లో ఫ్రెండ్స్ లో మందు కొట్టడం ఫన్ గా ఉండేది. అదొక సరదా. అప్పట్లో బాగానే ఎంజాయ్ చేశాను. కానీ ఏళ్లు గడిచేకొద్దీ అది నాకు పడలేదు. తాగింది చాలు మానేద్దాం అనిపించింది. అలా మెల్లగా మానేశా."

అలా 14 ఏళ్ల వయసు నుంచే తాగుతున్న నిధి అగర్వాల్, ఆరేళ్ల కిందట మద్యపానం ఆపేసింది. పూర్తిగా మానేసింది. మద్యపానం ఆరోగ్యానికి హానికరం అని కాస్త లేటుగా తెలుసుకుంది.

"నేను చివరిసారి మద్యం సేవించి ఆరేళ్లయింది. ఎందుకో మద్యపానం మంచిది కాదని నాకే అనిపించింది. మందు కొట్టినప్పుడు కొంచెం ఆత్రుతగా ఉండేదాన్ని, కొన్నిసార్లు భయపడేదాన్ని. ఇంకా చెప్పాలంటే మందు కొట్టడాన్ని నేను ఆస్వాదించలేకపోయాను. కొన్నాళ్లకు మద్యపానం నాకు పడదని గ్రహించాను. నా బాడీ కూడా ఆల్కహాల్ ను అంగీకరించట్లేదని తెలుసుకున్నాను. అలా తెలుసుకున్న వెంటనే మానేశాను. అలాంటి పార్టీలకు వెళ్లడం మానేశాను. ఇప్పుడిప్పుడే కొన్ని పార్టీలకు వెళ్తున్నాను. నా ఫ్రెండ్ కొంతమంది తాగుతారు, నేను మాత్రం తాగను."

మరి ప్రస్తుతం పార్టీల్లో నిధి అగర్వాల్ ఏం చేస్తోంది? అందరూ మద్యం సేవిస్తుంటే, నిధి అగర్వాల్ మాత్రం గ్రీన్ టీ తాగుతుందంట. మద్యం సేవించకుండా పార్టీలో ఉంటేనే బాగా ఎంజాయ్ చేస్తామని చెబుతోంది. ఇదీ నిధి అగర్వాల్ మందు కథ.

# హోం బ్యానర్‌లో రామ్ చరణ్ సినిమా

మెగా కాంపౌండ్ లో హోమ్ బ్యానర్ అంటే చాలానే ఉన్నాయి. ఆ మాటకొస్తే, ప్రత్యేకంగా రామ్ చరణ్ కు కూడా ఓ బ్యానర్ ఉంది. కానీ ఇక్కడ హోం బ్యానర్ అంటే గోల్డ్ బాక్స్. చరణ్ సోదరి సుశ్మితకు చెందిన బ్యానర్ ఇది. ఈ బ్యానర్ పై చరణ్ తో కచ్చితంగా సినిమా ఉంటుందంటున్నారు సుశ్మిత.

"రామ్ చరణ్ తో సినిమా అనేది నాకు టార్గెట్ కాదు. అది నా కోరిక. ఎప్పటికైనా చరణ్ తో సినిమా తీస్తా. ఫాదర్ అయినప్పటికీ, చిరంజీవి గారితో సినిమా చేయడానికి ఇన్నేళ్లు వెయిట్ చేయాల్సి వచ్చింది. క్యూలో ఉండాల్సి వచ్చింది. చరణ్ తో సినిమా కోసం కూడా మేం క్యూలో ఉన్నాం. నా లైనప్ లో ఆ సినిమా కూడా ఉంది. కాకపోతే నేను కూడా క్యూలో ఉన్నాననే విషయం చరణ్ కు ఇప్పటివరకు చెప్పలేదు. ఇక చెప్పేస్తా."

ఇలా చరణ్ తో సినిమా చేయబోతున్న విషయాన్ని సుశ్మిత బయటపెట్టారు. అయితే అది ఇప్పట్లో సాధ్యం కాదనే విషయాన్ని కూడా ఆమె పరోక్షంగా వెల్లడించారు. దానికి కనీసం మరో మూడేళ్లయినా పట్టొచ్చు. ప్రస్తుతం పెద్ది సినిమా చేస్తున్నాడు చరణ్. ఆ తర్వాత సుకుమార్ దర్శకత్వంలో సినిమా ఉంటుంది. సాహు గారపాటితో కలిసి మన శంకరవరప్రసాద్ గారు సినిమాను నిర్మించారు సుశ్మిత. అదే విధంగా మైత్రీ మూవీ మేకర్స్ తో కలిసి చరణ్-సుకుమార్ సినిమాను ఆమె కో-ప్రొడ్యూస్ చేయొచ్చు. అయితే ప్రస్తుతానికి అలాంటి ఆలోచన లేదని సుశ్మిత స్పష్టం చేశారు.



# ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు



**నవతరం-శ్రీకాకుళం**

తే. 22 జనవరి 2026ది నాడు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సి. హెచ్. ద్వారక తిరుమల రావు, శ్రీకాకుళం బస్ స్టేషన్ మరియు శ్రీకాకుళం రెండవ డిపో లను సందర్శించినారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం రెండవ డిపో గ్యారేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) శ్రీ.అందవరపు అప్పలరాజు గారు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, విజయనగరం జోన్-1 శ్రీమతి.విజయ గీత గారు, శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీ సి. హెచ్. అప్పలనారాయణ గారు, విజయనగరం జోన్-1 డెప్యూటీ సిటిఎం శ్రీ.జి సత్యనారాయణ గారు, విజయనగరం జోన్-1 డిప్యూటీ సీ.ఎం.ఇ. శ్రీ.కె.శ్రీనివాసరావు గారు, ఇతర అధికారులు, సూపర్వైజర్లు, అసోసియేషన్ నాయకులు, సెక్యూరిటీ సిబ్బందితో పాటు పత్రికా ప్రతినిధులు హాజరైనారు.

## కడపలో జరుగుతున్న శ్రీరామ మహా శోభాయాత్రలో

# అలరించిన శ్రీకాకుళం జిల్లా జానపద



**నవతరం-శ్రీకాకుళం**

కడపలో జరుగుతున్న శ్రీరామ శోభాయాత్రలో ప్రతి సంవత్సరం శ్రీకాకుళం జిల్లా గుండెచప్పుడు తప్పెటగుళ్ళు కళా రూపానికి ఒక ప్రత్యేకత స్థానం ఉంటుంది లక్షలాదిమంది తిలకిస్తున్నటువంటి ఈ మహా శోభాయాత్రకు శ్రీకాకుళం జిల్లా మెలియాపుట్టి మండలం చీపురుపల్లి గ్రామానికి చెందిన పాలిన శంకర్రావు బృందానికి అవకాశం కల్పిస్తూ ఆదరిస్తున్నారు శృతిలయ పద నృత్య విన్యాసాలతో సాగుతున్న ఈ ప్రదర్శన అధ్యంతం భక్తులను ఆకర్షిస్తున్నది ప్రధానంగా రామాయణంలోని సుందరాకాండ ఘట్టాలను ఆలపిస్తూ సాగుతున్న ఈ నృత్యానికి భక్తులు కానుకలు ఇస్తూ అభినందిస్తున్నారుఈ బృందానికి నిర్వహణ కమిటీ సన్మాన సత్కారాలతో రెండు రోజులు ఆతిధ్యం ఇచ్చి ఎంత మంచి అవకాశాన్ని ఇచ్చినటువంటి శ్రీరామ మహాశోభాయాత్ర నిర్వహణ కమిటీకి రంగం ప్రజా సంస్కృతిక వేదిక రాష్ట్ర కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాము.

# రాష్ట్ర ఉత్తమ పాఠశాలగా జలుమూరు మోడల్ ప్రైమరీ స్కూల్



**నవతరం-జాలుమూరు**

స్వచ్ ఏవం హరిత విద్యాలయ పురస్కారంలో భాగంగా రాష్ట్ర ఉత్తమ పాఠశాలగా మోడల్ ప్రైమరీ స్కూల్, జలుమూరు ఎంపికైశీదని, ఉపాధ్యాయులు మెండ.రామారావు తెలిపారు. గురువారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ పురస్కార ప్రధానోత్సవం జనవరి 26 న ఉంటుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకోనున్నామన్నారు. ప్రతి పాఠశాలను పరిశు భ్రత, స్థిరత్వం, వాతావరణ స్పృహ బాధ్యత యొక్క నమూనాగా పాఠశాల రూపురేఖలు మార్చడానికి దేశవ్యాప్తంగా స్వచ్ ఏవం హరిత విద్యాలయ పురస్కారం అందిస్తున్నారన్నారు. ఇంతటి గౌరవం మా పాఠశాలకు రావటం చాలా సంతోషకరమని, రానున్న రోజులలో శతశాతం ఉత్తీర్ణతే ధ్యేయంగా ముందుకు వెళ్తామని, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్ధులు, గ్రామస్ధులు పాల్గొన్నారు.

# జనవరి 25వ తేదిన ప్రత్యేక బస్సులు సౌకర్యం

**నవతరం-శ్రీకాకుళం**

రథసప్తమి వేడుకల సందర్భంగా జనవరి 25వ తేదిన ప్రత్యేక బస్సులు నడపడం జరుగుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి. సి.హెచ్. అప్పలనారాయణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అరసవిల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో నిర్వహించబడే రథసప్తమి వేడుకల సందర్భంగా ప్రయాణీకుల సౌకర్యార్థం, విశాఖపట్నం, విజయనగరం, రాజాం, పాలకొండ, బత్తిలి, శ్రీముఖలింగం, పాతపట్నం, టెక్కలి, పలాస మొదలగు ప్రాంతాల నుండి శ్రీకాకుళం ఆర్ టి సి కాంప్లెక్స్ వరకు జనవరి 25వ తేదిన ప్రత్యేక బస్సులు సాధారణ చార్జీలతో నడపబడునని ఆయన పేర్కొన్నారు. శ్రీకాకుళం కాంప్లెక్స్ నుండి డే , నైట్ జంక్షన్, ఏడు రోడ్ల జంక్షన్, జిల్లా పరిషత్ మీదుగా పసగడ సూర్యనారాయణ మిల్లు వరకు ప్రతి 10 నిమిషములకు ప్రత్యేక బస్సులు ప్రయాణీకుల సౌకర్యార్థం సాధారణ చార్జీలతో నడపడం జరుగుతుందని తెలిపారు. పసగడ సూర్యనారాయణ మిల్లు నుండి శ్రీకాకుళం కాంప్లెక్స్ వరకు రావడానికి కూడా ప్రత్యేక బస్సులు నడపడం జరుగుతుందని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాల్సిందిగా కోరడమైనదని ఆయన పేర్కొన్నారు.

# హలో యువత 'చలో విజయవాడ'

**- నిరుద్యోగ రణభేరి ని జయప్రదం చేయండి...**

**- ఏఐవైఎఫ్ పిలుపు...**



**నవతరం-శ్రీకాకుళం**

జనవరి 30న నిర్వహించనున్న "చలో విజయవాడ- నిరుద్యోగ రణభేరి" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజాడ యుగంధర్ పిలుపునిచ్చారు. ఈరోజు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం క్రాంతి భవన్ లో నిరుద్యోగ రణభేరి కి సంబంధించి గోడ పత్రికను విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజా?డ యుగంధర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లక్షలాది నిరుద్యోగ యువత తీవ్ర నిరాశ, అసంతృప్తిలో కూరుకుపోయిందని పేర్కొంటూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిన చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని 'కూటమి' ప్రభుత్వం యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని తీవ్రంగా విమర్శించారు. ఇప్పటివరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడం, నిరుద్యోగ భృతి అమలు చేయకపోవడం, నోటిఫికేషన్ల విడుదలలో నిర్లక్ష్యం వహించడం వల్ల లక్షలాది మంది యువత ఏళ్ల తరబడి ఎదురుచూపుల్లోనే మగ్గిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ పరిస్థితులకు నిరసనగా నిరుద్యోగ యువత హక్కుల సాధన కోసం జనవరి 30న విజయవాడలో "నిరుద్యోగ రణభేరి -చలో విజయవాడ" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతి అమలు చేయాలిని, ప్రభుత్వ శాఖలలో ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేయాలి, ఔట్‌సోర్సింగ్ -కాంట్రాక్ట్ విధానాలను రద్దు చేసి శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువత ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిస్తూ, "కొలువులోకై కొట్లాడుదాం. రండి!" అని నినాదం చేస్తూ జనవరి 30న విజయవాడకు భారీగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ టౌన్ కన్వీనర్ ఎ. వేణు, నాయకులు రామోజీ, అన్నాజీ, శశి తదితరులు పాల్గొన్నారు.

## రెన్ కో-జి (టోక్యో) బౌద్ధ మందిరంలో

# నేతాజీ చితా భస్మం...



రెన్ కో - జి లో నేతాజీ కాంస్య విగ్రహం



టోక్యో ( జపాన్ ) లోని రెన్ కో - జి బౌద్ధ మందిరం

భారతదేశ ప్రజలకు చిరస్మరణీయులు, స్ఫూర్తి ప్రదాత, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, జయంతే కాని వర్ధంతి లేని సుభాష్ చంద్రబోస్ 130 వ జయంతిని ఈనెల 23 న జరుపుకుంటున్న తరుణం లో నేతాజీ స్మారక స్థూపం, చితా భస్మం భద్రపరచారని భావిస్తున్న పవిత్ర స్థలం ఎక్కడుంది? అక్కడెందుకుంది ? వంటి అంశాలపై ఈ కథనం...

సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలోని అజాద్ హింద్ ఫౌజ్ జపాన్ దేశపు పూర్తి సైనిక, నైతిక మద్దతుతో బర్మా, కోహిమాలు దాటి ఇంఫాల్ చేరుకుంది. అయితే, రెండవ ప్రపంచ యుద్ధం చివరి దశలో అమెరికా హీరోషిమా, నాగసాకి పట్టణాలపై అణుబాంబులతో జరిపిన దాడి ప్రత్యర్థి జపాన్ ను ఆత్మరక్షణ లో పడేయటంతో... తమ దేశం మరింత నష్టపోవడం ఇష్టం లేక జపాన్ యుద్ధం నుండి తప్పుకుంది.

మిత్ర రాజ్యాలు విజయం, అక్ష రాజ్యాలు ఓటమితో సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయంగా రష్యా వంటి కొత్త మిత్రుల సహాయం కోసం ముందడుగు వేసారు . ఈ లక్ష్య సాధనలో భాగంగా అజాద్ హింద్ ప్రభుత్వ ప్రధాన కేంద్రం సింగపూర్ నుండి సహచరులను, సైన్యాన్ని వెళ్ళిపోమని సూచించిన నేతాజీ 1945 ఆగష్టు 17 న వియత్నాం లోని సెగాన్ లో విమానం లో బయలుదేరారు. అయితే, ఆ విమానం ప్రమాదానికి గురైందని , ఈ ప్రమాదంలో ఆగష్టు 18 న సుభాష్ చంద్రబోస్ తైవాన్ లో మరణించారని టోక్యో రేడియో ఆగష్టు 22న ప్రకటించటంతో భారతావనితో పాటు ప్రపంచమంతా దిగ్భ్రాంతి చెందింది. నేతాజీ ఈ ప్రమాదంలో మరణించలేదని, అజ్ఞాత జీవితం గడిపారనే వాదన కూడా ఉంది.

విమాన ప్రయాదంలో మరణించారని భావిస్తున్న సుభాష్ చంద్రబోస్ చితాభస్మాన్ని సేకరించిన జపాన్ ప్రభుత్వం వీటిని టోక్యో నగర శివార్లలో గల రెన్ కో - జి బౌద్ధ మందిరం లో చిన్న బంగారు పగోడా లో భద్రపరిచారని భావిస్తున్నారు.

ఈ ఆలయ ప్రాంగణంలో 1975 లో నేతాజీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేసారు.

భారతదేశ రాష్ట్రపతి డా.బాబు రాజేంద్ర ప్రసాద్, ప్రధాన మంత్రులు జవహర్ లాల్ నెహ్రూ, శ్రీమతి ఇందిరాగాంధీ, ఏ బి వాజపేయి తో పాటు మన దేశానికి చెందిన ప్రముఖులెందరో ఈ పవిత్ర స్థలాన్ని సందర్శించారు.

ప్రతిఏటా నేతాజీ వర్ధంతిగా భావిస్తున్న ఆగష్టు 18 న రెన్ కో - జి బౌద్ధ మందిరాన్ని భారతీయులు మరియు జపనీయులు సందర్శించి పండ్లు, పుష్పాలతో తమ ప్రియతమ నేతకు ఘన నివాళి ఘటిస్తారు.

ఈ ప్రాంతం ఇప్పుడు ఓ పవిత్ర, చారిత్రక, యాత్రాస్థలమైనది.

సుభాష్ చంద్రబోస్ కి చెందినదిగా భావిస్తున్న ఈ చితాభస్మాన్ని డి ఎన్ ఏ పరీక్ష ద్వారా నిర్ధారించి భారతదేశానికి తేవాలని వీరి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

నేతాజీ మరణం పై స్పష్టత లేనందున, 1992 లో భారత ప్రభుత్వం నేతాజీకి ప్రకటించిన భారతరత్న పురస్కారాన్ని కుటుంబ సభ్యులు తిరస్కరించారు. చౌధరి రాధాకృష్ణ, గాంధేయవాది, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, శ్రీకాకుళం.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**